క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి

దెందులూరు: వైఎస్సార్ సీపీని దెందులూరు నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని నియోజకవర్గ కన్వీనర్ కొఠారు అబ్బయ్య చౌదరి పార్టీ శ్రేణులకు సూచించారు. వైఎస్ఆర్ సీపీకి రాబోయే కాలంలో మంచి భవిష్యత్తు ఉంటుందని నాయకులు, కార్యకర్తలు కష్టించి పని చేయాలని ఏపీ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి అన్నారు. శుక్రవారం ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన డీబీఆర్‌కే చౌదరి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

దోమలతోనే వ్యాధుల వ్యాప్తి

గణపవరం: దోమలను అరికట్టడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం గణపవరం పీహెచ్‌సీలో ఫ్రైడే- డ్రైడే సందర్భంగా సీజనల్ వ్యాధులు, వాటి వ్యాప్తిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. సీహెచ్‌వో విల్సన్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడిగా పులిదండి

దెందులూరు: గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దెందులూరు మండల గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా ఎంపికైన దెందులూరు గ్రామ రెవెన్యూ అధికారి పులిదండి శ్రీనివాస్ అన్నారు. దెందులూరు మండలం గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం మాజీ అధ్యక్షుడు కిషోర్, మార్గాని రామారావు ఆధ్వర్యంలో మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.

ముగిసిన శిక్షణ

దెందులూరు: విద్యార్థులలో నైతిక విలువలు క్రమశిక్షణ సత్ప్రవర్తన పెంపొందించడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ అవసరమని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ అన్నారు. శుక్రవారం దెందులూరు మండలం వేగవరంలో హేలాపురి ఇంజనీరింగ్ కళాశాలలో స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్స్ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఈ నెల 4 నుంచి శుక్రవారం వరకు స్కౌట్స్, గైడ్స్‌కు శిక్షణ శిబిరం నిర్వహించామన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా కార్యదర్శి భాస్కర్ కుమార్, స్కౌట్స్ విభాగానికి ప్రసాద్, గైడ్స్ విభాగానికి ధనలక్ష్మి, పద్మ, ఎంఈఓ కే. అన్నమ్మ, ఎస్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

భీమడోలు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం భీమడోలు వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించారు. వివిధ ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. వివిధ గ్రామాల నుంచి 45 మంది నిరుద్యోగులు హాజరు కాగా వారిలో 18 మంది వివిధ ప్రైవేటు బ్యాంకుల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జితేంద్రబాబు, ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్, ఇన్‌చార్జి జే.రాము, కోఆర్డినేటర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

బాల్య వివాహరహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

భీమడోలు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాధ్యులపై చట్టం కఠిన శిక్షిస్తుందని శుక్రవారం కొల్లేరు గ్రామం చెట్టున్నపాడులో చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహ నిరోధంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిగితే 112, 1098కు ఫోన్ చేయాలని కోరారు. జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అంతా కృషి చేయాలన్నారు.

అత్యవసర విభాగం గది ప్రారంభం

ఉంగుటూరు: చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్మితమైన అత్యవసర విభాగం గదిని స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శుక్రవారం ప్రారంభించారు. పైప్లైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సౌజన్యంతో ఈగదిని రూ.15 లక్షల వ్యయంతో నిర్మించారు. సీసీ రోడ్డును ధర్మరాజు ప్రారంభించారు.సర్పంచి రందే లక్ష్మీసు నీత రాజు, డాక్టర్లు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

గణపవరం: గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. పీహెచ్‌సీలో నాలుగు సచివాలయాల పరిధిలోని గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, హెచ్‌వి పద్మజ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఎరువుల అధిక వినియోగంతో అనర్థం

- భూసారానికి తీవ్ర నష్టం
- చీడపీడల వ్యాప్తికి దోహదం
- ప్రజారోగ్యానికి చేటు



దాళ్వా వరి పైరుకు ఎరువులు వేస్తున్న రైతులు

గణపవరం : చేనుకు చేవ, రైతుకు రొక్కం, మా ఎరువునే వాడండి. ఇది అందరికీ సుపరిచితమైన ఒక ప్రముఖ ఎరువుల కంపెనీ వ్యాపార నినాదం. అయితే ఎరువుల వాడకం కూడా పరిమితికి మించితే కలిగే నష్టం కూడా ఎక్కువే. ఎరువుల వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకొని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడితో పాటు, పెట్టుబడి వ్యయం కూడా తగ్గించుకోవచ్చునని రైతులకు వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. రబీ సాగులో ఎరువులు ముఖ్యంగా నత్రజని ఎరువులను సిఫార్సు మేరకే వాడాలని, అధికంగా నత్రజని వాడటం వల్ల నష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు.

ఉంగుటూరు నియోజకవర్గంలో 48,883 ఎకరాల్లో రబీ సాగు

ఉంగుటూరు నియోజకవర్గంలో సుమారు 48,883 ఎకరాల్లో రబీ వరిసాగు జరుగుతుండగా, గణపవరం మండలంలో సుమారు 11,713 ఎకరాల్లో రబీ వరి సాగు చేస్తున్నారు. సుమారు 70 శాతం భూముల్లో వరినాట్లు పూర్తికాగా, మిగిలిన వాటిలో సంక్రాంతి లోపు నాట్లు పూర్తి చేసే అవకాశం ఉంది. ముందుగా నాట్లు వేసిన రైతులు ఇప్పటికే మొదటి విడత ఎరువులు వేయడం పూర్తి చేసి రెండో విడత ఎరువులు వేయడానికి సన్నద్ధమవుతున్నారు. రైతులు ముఖ్యంగా వరి మొక్కల ఎదుగుదలకు అవసరమైన నత్రజనిని అందించే యూరియా ఎరువులను అధికంగా వాడుతున్నారు. చాలామంది రైతులు అవగాహనా లోపంతో అవసరానికి మించి అధికంగా యూరియా వాడుతూ నష్టపోతున్నారు. నత్రజని ఎరువు అధికంగా వాడటంవల్ల పంటలపై చీడపీడలు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంటుంది. తెగుళ్లు ఆశిస్తే రైతులు పురుగుమందులకు ఎక్కువగా ఖర్చు చేయాల్సి వస్తోంది. వరిలో కొన్నేళ్లుగా ఎండాకు తెగులు ఆశించడంతో రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. ఇందుకు నత్రజని ఎరువుల అధిక వాడకమే కారణమని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు నిర్ధారిస్తున్నారు.

పరిమితికి మించి ఎరువుల వినియోగంతో నష్టాలివీ

- వ్యవసాయ అధికారుల సిఫార్సు మేరకే ఎరువులు వాడాలి
- నత్రజని ఎరువుల అధిక వాడకం వల్ల భూసారం దెబ్బ తింటుంది.
- పంటలపై చీడపీడలు త్వరగా ఆశిస్తాయి. పెట్టుబడులు పెరుగుతాయి. నీటి వినియోగం పెరుగుతుంది.
- పంట దిగుబడి తగ్గుతుంది. పంట నాణ్యత కోల్పోతుంది.
- పైరు త్వరగా ఎదిగి కొద్దిపాటి గాలికే పడిపోతుంది.
- వాతావరణ కాలుష్యం పెరుగుతుంది.
- ఎండాకుతెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం



కొన్నేళ్లుగా రైతులు అవసరం మేరకే ఎరువులను వాడుతున్నారు. ఎరువుల అధిక వినియోగం వల్లన కలిగే నష్టాలపై రైతులకు అవగాహన వచ్చింది. రబీ పైరుకు నత్రజని (యూరియా) ఎరువు సుమారు 80 కిలోలను మూడు సమ భాగాలుగా మూడు దఫాలుగా వేయాలి. సూపర్ సింగిల్ పాస్ఫేటు 100 కిలోలు ఆఖరి దమ్ములో వేయాలి. పొటాష్ 40 కిలోలు రెండు దఫాలుగా వేయాలి. కాంప్లెక్స్ (భాస్వరం) ఎరువులు పైపాటుగా వేయవద్దు. అలావేస్తే మొక్కలు గ్రహించవు. యూరియాను వేసే ముందు నీటిని తీసివేసి, బురద పదునులో వేయాలి. 48 గంటల తర్వాత నీరు పెట్టాలి. నత్రజనితో పాటు కలుపు మందులు కలపరాదు.

– యర్రంశెట్టి ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి

నియోజకవర్గంలో రబీ సాగు (ఎకరాల్లో)

మండలం	రబీ సాగు లక్ష్యం
ఉంగుటూరు	21,173
నిడమర్రు	5,328
భీమడోలు	10,669
గణపవరం	11,713
మొత్తం	48,883

విద్యాబోధనలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలి



మోటివేషన్ స్పీకర్ షఫీ

దెందులూరు: విద్యాబోధనలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మోటివేషన్ స్పీకర్ షఫీ అన్నారు. చేరుజోగన్నపాలెంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉన్నత పాఠశాల కళాశాలలో అత్యున్నతమైన ప్రమాణాలతో విద్యా బోధన, పూర్తిస్థాయి సౌకర్యాలతో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న మాకా యాజమాన్యం మరిన్ని విజయాలు సాధించాలని ప్రముఖ మోటివేషన్ స్పీకర్ షఫీ అన్నారు. మాకా పాఠశాల కళాశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. అనంతరం షఫీని మాక విద్యాసంస్థ చైర్మన్ మహమ్మద్ వసీవుల్లా, డైరెక్టర్లు మహమ్మద్ వుసామా ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

కోడిపందేలు, పేకాట నిరోధానికి ప్రత్యేక కమిటీలు

దెందులూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో కోడిపందేలు పేకాట నిరోధించడానికి మండల గ్రామస్థాయి ఉద్యోగులతో కమిటీ ఏర్పాటు చేసినట్టు దెందులూరు తహసీల్దార్ బి.సుమతి, దెందులూరు ఏఎస్సై పి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం దెందులూరు, కొవ్వలి, పోతునూరు గ్రామ సచివాలయాల్లో ప్రజలతో అవగాహన సమావేశాలు నిర్వహించారు. సుప్రీంకోర్టు ఇటీవల నూతన చట్టాలను రూపొందించిందని ఎవరైనా కోడిపందేలు పేకాట అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. పాత నేరస్తులపై నిఘా పెట్టామన్నారు.

జాతీయ నాణ్యత హామీ కార్యక్రమంపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న గణపవరం సర్పంచ్ పీహెచ్‌సీ సిబ్బంది

గణపవరం: జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాల కార్యక్రమం అమలుతీరుపై గణపవరం–2 సచివాలయ పరిధిలోని హెల్త్ వెల్నెస్ కేంద్రంలో నేషనల్ క్వాలిటీ అసెస్మెంట్ స్టాండర్ప్స్ బృంద సభ్యులు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అసెస్మెంట్ బృంద సభ్యులు డా.అశ్వని కుమార్, డా. దర్బీర్‌సింగ్‌ధిల్లాన్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని వివిధ రకాల ప్రశ్నలతో అసెస్మెంట్ నిర్వహించారు. గణపవరం గ్రామ సచివాలయం –2 పరిధిలోని హెల్త్ వెల్నెస్ కేంద్రంలో నిర్వహించే జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ఏవిధంగా జరుగుతున్నాయో ఆరా తీశారు. ఇద్దరు రోగులు, ఒక గర్భిణితో అసెస్మెంట్ చేస్తున్న బృందం నేరుగా మాట్లాడి వెల్నెస్ కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. వారు చెప్పిన సమాధానాలతో బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేవారు. నేషనల్ క్వాలిటీ ఎసెస్‌మెంట్ డివిజన్ అధికారి అనితావిల్సన్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి గణపవరం సర్పంచ్ మూర అలంకారం, సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైష్ణవ ఆలయాలకు పోటెత్తిన భక్తులు



భీమడోలులోని వేంకటేశ్వర స్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు



ఉత్తరద్వార దర్శనంలో స్వామివార్లు

ఉత్తర ద్వారంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు

భీమడోలు: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజాము నుంచి మండలంలోని వైష్ణవ ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ముక్కోటి పండుగ సందర్భంగా విష్ణువును దర్శించుకుంటే స్వర్గం ప్రాప్తిస్తుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఆలయాల్లో స్వామివారిని భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురంలో వేంకటేశ్వర స్వామి, రామాలయాలు గోవింద నామ స్మరణతో మార్మోగాయి. భీమడోలులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి, పూళ్లలోని వేంకటేశ్వర స్వామి, గుండుగొలనులోని వేంకటేశ్వర స్వామి, భీమడోలు జంక్షన్‌లోని రూపక దేవాలయాల్లో సుందరంగా అలంకరించిన స్వామి వారికి విశేష పూజలు చేసిన అర్చకులు భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. గుండుగొలనులో స్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి, అచ్యుత రామారావు, అర్చకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి

దెందులూరు: ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని గ్రామాల్లో, ఆలయాల్లో ఉత్తరద్వార దర్శనాల్లో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. దెందులూరు విష్ణు ఆలయం, వీరభద్రపురం ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం ఉత్తరద్వార దర్శనాలను ఏర్పాటు చేశారు. భక్తులు స్వామి వార్ల దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సందడిగా సంక్రాంతి సంబరాలు



పెదవేగి: భోగి మంట వద్ద సందడి



పెదవేగి: ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న వైద్య విద్యార్థులు



భీమడోలు: గొబ్బెమ్మల చుట్టూ నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు



గణపవరం: జల్లికొమ్మర పాఠశాలలో చిన్నారులకు భోగిపండ్లు వేస్తున్న దృశ్యం



భీమడోలు: రంగవల్లుల పోటీల్లో విద్యార్థినులు



దెందులూరు: గంగన్నగూడెం హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. దీనితో విద్యాలయాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా వేడుకలు నిర్వహించారు. భోగిపండ్ల పేరంటం, బొమ్మల కొలువు, డూడూ బసవన్న విన్యాసాలు, హరిదాసు సంకీర్తనలు, భోగి మంటలు, రంగవల్లుల పోటీలతో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థులంతా సంప్రదాయ వస్త్రధారణతో గొబ్బెమ్మల చుట్టూ వారంతా నృత్యాలు చేసారు. విద్యార్థులు గాలి పటాలు ఎగర వేసి సందడి చేశారు.

– గణపవరం, భీమడోలు, పెదవేగి, దెందులూరు

గోపినాథపట్నం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



గోపినాథపట్నం ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న కొట్టు సత్యనారాయణ దంపతులు

ఉంగుటూరు: గోపినాథపట్నం ఆంజనేయస్వామి ఆలయంలో ముక్కోటి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో దేవదాయశాఖ ధర్మదాయశాఖ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు పాల్గొని పూజలు చేశారు. గోపూజ సహస్ర దీపాల పూజ, లక్ష తమలపాకులతో సహస్ర నామ పూజలు చేశారు. గొల్లగూడెం సాయి సమాజం, కొత్తగూడెం సీతారామ భక్తాంజనేయ సమాజం, గోపాలపురం లక్ష్మీగణపతి భజన సమాజం, గోపినాథపట్నం, గొల్లగూడెం, తిమ్మయ్యపాలెం, కృష్ణంపాలెం సీతారామ భజన సమాజం వార్లు గీతామందిరంలో భజన కార్యక్రమాలు, హనుమాన్ ఛాలీసా పారాయణం నిర్వహించారు. భక్తులు వేల సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కొట్టు సత్యనారాయణ, కుటుంబ సభ్యులు పర్యవేక్షించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

పెదపాడు: కిశోరీ వికాసం కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయ కన్సల్టెంట్ నర్సింహ మూర్తి తెలిపారు. పెదపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు అవగాహన, మండల స్థాయి కమిటీ, గ్రామ స్థాయి కమిటీ సభ్యుల అభిప్రాయాలను కిశోర బాలికల సమూహములతో పరస్పర చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2.0 కార్యక్రమంలో లింగ వివక్ష, సంపూర్ణ ఆహారం, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత రుతుస్రావ పరిశుభ్రత, బాలికలపై లైంగిక వేధింపుల నుంచి రక్షణ, బాల్యవివాహాలు అరికట్టడం, మానవ అక్రమ రవాణాను అరికట్టడం, బాలికల ఆత్మ రక్షణ చర్యలు నేర్పడం, తదితర అంశాలపై గ్రామాల్లో బడిమానివేసిన కిశోర బాలికలను గుర్తించి వారికి ఈ అంశాల్లో శిక్షణ ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. బాలల సంరక్షణ అధికారి సీహెచ్ సూర్య చక్రవేణి మాట్లాడుతూ బాల్యవివాహాలపై చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేం

భీమడోలు: ప్రజల ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరవలేనివని భీమడోలు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు పాము సునీతామాన్‌సింగ్ అన్నారు. భీమడోలు గ్రామ పంచాయతీలో సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను బహూకరించారు. పోలసానిపల్లిలో సర్పంచ్ షేక్ రహీమాబేగం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బందికి, నీటి సరఫరా విభాగం సిబ్బంది నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులను అందించారు. గ్రామ కార్యదర్శులు తనూజ, యు.జయరామకృష్ణ, సచివాలయ సిబ్బంది, పెద్దలు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



పెదవేగి సచివాలయ ఆవరణలో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

పెదవేగి : రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడి పందేలు నిర్వహించే వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామని పెదవేగి సర్కిల్ సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మండల తహసీల్దార్ భ్రమరాంబ అధ్యక్షతన పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు పెదవేగి, కూచింపూడిలో పర్యటించి ప్రజలకు కోడిపందేలు, గుండాట, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాల వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ, నాయకులు, పోలీస్ సిబ్బంది, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు

ఉంగుటూరు: కోడి పందేలు ఆడితే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు హెచ్చరించారు. శుక్రవారం ఉంగుటూరు మండలం గొల్లగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జూదాల వల్ల కలిగే అనర్థాలపై సర్పంచి కరపాశ్రీను అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. ఆర్ఐ దావీదు రాజు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు, జూదక్రీడలు వద్దు... సంప్రదాయ ఆటలే ముద్దు

భీమడోలు: కోడి పందాలు.. జూదక్రీడలు వద్దు... సాంప్రదాయక ఆటలు ముద్దు అంటూ శుక్రవారం రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులు పోలసానిపల్లిలో ర్యాలీ, ప్రదర్శన చేసారు. తొలుత పంచాయతీ కార్యాలయం వద్ద కోడి పందాలు, పేకాట, గుండాట వంటి జూద క్రీడల నిషేధంపై ప్రజా అవగాహన ర్యాలీని నిర్వహించారు. సర్పంచ్ షేక్ రహీమాబేగం అధ్యక్షత వహించారు. గ్రామస్తులు, పెద్దలు, యువకులు, ఉద్యోగులంతా ప్రదర్శన చేసి రహదారిపై మానవహారం చేసారు. ఈ సందర్భంగా తహసిల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ ముసుగులో కోడి పందాలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలను సాగిస్తే కోర్టు ధిక్కార కేసులు నమోదు చేస్తే హెచ్చరించారు. సంక్రాంతి పండుగలో సాంప్రదాయ ఆటల పోటీలను నిర్వహించుకుని, పండుగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై చలపతిరావు, ఆర్ఐ కిరణకుమారి, గ్రామకార్యదర్శి యు.జయరామకృష్ణ, వీఆర్వో సాల్మన్‌రాజు, పెద్దలు షేక్ హసీనా, మునగంటి రమేష్, మద్దు శ్రీను, ఉండి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల బరుల ధ్వంసం

నిడమర్రు: సంక్రాంతి పండుగ పేరు చెప్పి గ్రామాల్లో కోడి పందేలు, గుండాటలు, పేకాట వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే వారిపై శాఖపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని సీఐ సుభాష్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి బావాయిపాలెంలో కోడి పందేలు నిర్వహించేందుకు సిద్ధం చేసిన బరిని వారు గుర్తించి ధ్వంసం చేసారు. సీఐ సుభాష్, ఎస్సై వీర ప్రసాద్, పోలీస్ సిబ్బంది కోడి పందేల బరిని ధ్వంసం చేశారు.